క్లుప్తంగా

ఘనంగా ముత్యాలమ్మకు బోనాలు



నరసింహారావుపాలెం(వీరులపాడు): మండలంలోని నరసింహారావుపాలెం గ్రామంలో ముత్యాలమ్మ అమ్మవారి బోనాల కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా మూడు రోజులుగా అమ్మవారికి జలబిందెలతో ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని, డప్పు వాయిద్యాలతో బోనాలను గ్రామంలో ఊరేగించి ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలతో సంతోషంగా ఉండాలని ప్రతి ఏటా అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, సర్పంచ్ బొమ్మిశెట్టి దుర్గాదేవి, ఉప సర్పంచ్ గుంటక మాధవరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు శీలం రమణారెడ్డి, కోలా శ్రీను, శీలం సంజీవరెడ్డి, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు తహసీల్దార్ కార్యాలయంలో 'స్పందన'

కంచికచర్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ పబ్బూరి శంకరరావు ఆదివారం తెలిపారు. స్పందనలో గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రజలు అర్జీలు అందజేయాలని, వచ్చిన అర్జీలను ప్రాధాన్యతా క్రమంలో త్వరితగతిన పరిష్కరిస్తామని తహసీల్దార్ చెప్పారు.

తిరుపతమ్మ ఆలయానికి విరాళాలు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయ గోశాలలో గోవుల సంరక్షణకు ఆదివారం విజయవాడకు చెందిన కాంతి హాస్పిటల్స్ అధినేత డాక్టర్ కొల్లి క్రాంతి కిషోర్ రూ.10 వేలు విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. అలాగే తూర్పు గోదావరి జిల్లా రావులపాలెం మండలం, ఏనుగుమహల్‌కు చెందిన శ్రీశాంభవి పీఠాధిపతి మిరియాల శేషగిరిరావు దంపతులు ఉపాలయం అంకమ్మవారి ఆలయ రాజగోపురం వెండితాపడం తయారీకి చైర్మన్ ఇంజం చెన్నకేశవరావుకు రూ.10,001 విరాళంగా అందజేశారు. ఈసందర్భంగా అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలతో సత్కరించారు.

నేటితో ముగియనున్న ఓటర్ల సర్వే



నందిగామ: నియోజకవర్గంలో ఓటర్ల సర్వే వేగవంతంగా సాగుతోంది. రానున్న సార్వత్రిక ఎన్నికలకు తప్పులు లేని ఓటరు జాబితాను సిద్ధం చేసేందుకు సిబ్బంది, అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ సర్వే కార్యక్రమం సోమవారం సాయంత్రంతో ముగియనుండడంతో అధికారులు ఆదివారం నాడు కూడా సర్వే కార్యక్రమంలో పాల్గొన్నారు. బూత్ లెవెల్ అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ఓటరు జాబితా ప్రకారం వివరాలు సేకరిస్తూ అవసరమైతే మార్పులు, చేర్పుల కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

దాదాపుగా పూర్తయిన సర్వే

అధికారుల లెక్కల ప్రకారం నందిగామ నియోజకవర్గ పరిధిలో 1,95,796 మంది ఓటర్లు ఉన్నారు. వారితో ఇప్పటికే 1,80,633 మంది ఓటర్లకు సంబంధించిన జాబితాను బీఎల్వోలు వెరిఫికేషన్ పూర్తి చేశారు. ముఖ్యంగా నియోజకవర్గంలో మొత్తం 89,389 గృహాలు ఉండగా వాటిలో ఇప్పటికే 82,797 గృహాలను బీఎల్వోలు సర్వే చేశారు. సోమవారం సాయంత్రం నాటికి దాదాపుగా వెరిఫికేషన్ కార్యక్రమం పూర్తవుతుందని ఆర్డీవో రవీంద్రరావు తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

నందిగామ: పట్టణ శివారు ప్రాంతంలో పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను ఆదివారం సాయంత్రం నందిగామ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ హనీష్ తెలిపిన సమాచారం ప్రకారం పట్టణ శివారు డీవీఆర్ కాలనీ సమీపంలో పేకాడుతున్నారన్న సమాచారం రావడంతో దాడి చేశామన్నారు. పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.15,200 నగదు, ఐదు సెల్‌ఫోన్లు, ఒక స్కూటీని సీజ్ చేశామన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ చెప్పారు.

24న మండల పరిషత్ సమావేశం

ఇబ్రహీంపట్నం: స్థానిక మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 24 మధ్యాహ్నం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బీవీ.రామకృష్ణ నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ పాలడుగు జోత్స్న అధ్యక్షతన జరిగే సమావేశంలో మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై చర్చించనున్నారు.

దేశంలోనే ఆదర్శవంతమైన పాలన

- ప్రభుత్వ విప్ ఉదయభాను
- అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల అమలు
- జగ్గయ్యపేటలో గడప గడపకు మన ప్రభుత్వం



కొత్త బంగారుపేటలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేటఅర్బన్: గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ప్రవేశపెట్టిన సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. ఈ వ్యవస్థల సేవలను ఇతర రాష్ట్రాలు అభినందిస్తున్నాయన్నారు. కుల మతాలు, పార్టీలు, వర్గాలు, ప్రాంతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సీఎం వైఎస్ జగన్ పేదలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని చెప్పారు. పట్టణంలోని 7వ సచివాలయం పరిధిలోని 15, 18 వార్డుల్లోని కొత్త బంగారుపేట, చెరువుకట్ట ఆంజనేయస్వామి ఆలయం ప్రాంతం తదితర ప్రాంతాల్లో ఆదివారం ఎమ్మెల్యే ఉదయభాను గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత నాలుగేళ్లగా ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. అర్హత మేరకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా.. లేదా ..అని మహిళలను ఆరా తీశారు. ప్రతి ఒక్కరూ తమకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యేకు వివరించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి పొందినసంక్షేమ పథకాల బుక్‌లెట్లను లబ్ధిదారులకు అందజేశారు. కొత్త బంగారుపేటలో స్థానికులు విన్నవించిన రోడ్లు, డ్రెయినేజీ సమస్యలను పరిష్కరించాలని ఉదయభాను అధికారులను ఆదేశించారు.

ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు

అనంతరం ఎమ్మెల్యే ఉదయభాను మాట్లాడుతూ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో 99 శాతం పైగా నెరవేర్చామన్నారు. ఇవ్వని హామీలను సైతం అమలు చేశామని గుర్తుకు చేశారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, ప్రతి కుటుంబానికి మేలు చేస్తున్నామని చెప్పారు. రోడ్లు, డ్రెయిన్లు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతి సచివాలయానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో మరింత లబ్ధిని చేకూర్చేందుకు సీఎం ప్రణాళికలు రూపొందిస్తున్నారని, ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వాదించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు, పట్టణ సచివాలయాల కన్వీనర్ తుమ్మేపల్లి నరేంద్ర, ఏఎంసీ వైస్ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, డైరెక్టర్ గోలి రామేశ్వరి, మాజీ కౌన్సిలర్ ఎండీ.జాన్ బాషా, పార్టీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు చాపల వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికల ఫలితాలతో ప్రతిపక్షాలకు గుణపాఠం

ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేటఅర్బన్: గ్రామ సర్పంచ్, వార్డు సభ్యుల ఉప ఎన్నికల ఫలితాలు ప్రతిపక్షాలకు గుణపాఠం చెప్పాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. ఆదివారం ఆయన ఉదయభాను ఉప ఎన్నికల ఫలితాలపై ఆయన ఇంటి వద్ద మీడియాతో మాట్లాడారు. కనీసం 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు సొంత నియోజకవర్గం అయిన కుప్పం నియోజకవర్గంలో సైతం 6 వార్డులకు గాను 5 వార్డుల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించడం బట్టి ప్రజల్లో టీడీపీకి ఉన్న అభిప్రాయం తేట తెల్లం చేస్తున్నాయని తెలిపారు. వైఎస్సార్ సీపీ పని అయిపోయింది. ఇక వచ్చేది మా ప్రభుత్వమే అని ప్రచారం చేసుకుంటున్న చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్‌లకు ఈ ఫలితాలు చెంప పెట్టు అన్నారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ఇవి రాష్ట్ర ప్రజల రెఫరెండంగా నిలుస్తాయని తెలిపారు. ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చడమే కాకుండా, పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమార్థం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధితో సీఎం వైఎస్.జగన్ పాలన పట్ల రాష్ట్ర ప్రజల్లో ఒక విశ్వాసం, నమ్మకం ఉన్నాయని మరొకసారి నిరూపితం అయ్యాయన్నారు. ఎన్నిక ఏదైనా, ఎప్పుడు వచ్చినా వైఎస్సార్ సీపీ విజయ పరంపరను ఎవరూ ఆపలేరన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

బాబుకు, లోకేష్‌కు రాష్ట్రంలో తిరిగే అర్హత లేదు..

తెలుగుజాతి కీర్తి ప్రతిష్టలను నలుదెసలు చాటిన ఎన్టీఆర్ గురించి మాట్లాడే అర్హత చంద్రబాబు, లోకేష్‌లకు లేదని విప్ ఉదయభాను అన్నారు. రాష్ట్రంలో గాని, ఒక జిల్లాలో గాని ఒక మంచి పని చేశాను అని చెప్పుకునే అవకాశంలేని వారికి రాష్ట్రంలో తిరిగే అర్హత లేదన్నారు. ఎన్టీఆర్ వారసులం అని చెప్పుకునే వారికి రాష్ట్రంలో 23 జిల్లాలో ఒక్క జిల్లాకు కూడ ఎన్టీఆర్ పేరు పెట్టలేని వారికి ఎన్టీఆర్ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృష్ణా జిల్లాలో ఒక ప్రాంతానికి ఎన్టీఆర్ జిల్లాగా పేరు పెట్టి తన చిత్తశుద్ధిని చాటుకున్నారని తెలిపారు.

ఉత్తమ లైబ్రేరియన్లకు అవార్డులు అందజేత



కంచికచర్ల: స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని ఉత్తమ లైబ్రేరియన్లకు జిల్లా కలెక్టర్ చాంబర్‌లో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ తిప్పరమల్లి జమల పూర్ణమ్మ శనివారం రాత్రి అవార్డులను అందజేశారు. అవార్డు అందుకున్న వారిలో కంచికచర్ల గ్రేడ్ – 2 గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు ఉన్నారు. అవార్డు గ్రహీతలను గ్రంథ పాలకులు, సిబ్బంది అభినందించారు.

సంక్షేమ పాలనకు సంపూర్ణ మద్దతు



వెంకటేశ్వర్లు, సర్పంచ్

నందిగామటౌన్: గ్రామ పంచాయతీ ఉప ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు ప్రజలు సంపూర్ణ మద్దతు పలికారని వీరులపాడు మండలం దాచవరం గ్రామ సర్పంచ్ గద్దె వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉన్నామని రుజువు చేశారన్నారు. ముఖ్యంగా సాంప్రదాయాలకు తూట్లు పొడిచేలా ప్రతిపక్ష నాయకులు వ్యవహరించినా ప్రజలు మాత్రం తమ వెంటే ఉన్నారని గుర్తు చేశారు. విజయానికి కృషి చేసిన శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు, శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్‌లతో పాటు అండగా నిలిచి ఓట్లేసి గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానని తెలిపారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

రెడ్డిగూడెం: గ్రామ పంచాయతీ పరిధిలోని బోసు మెకానికల్ సెంటర్ దగ్గర అభ్యుదయ యువశక్తి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు ఆ సంఘం అధ్యక్షుడు చింతిరాల వెంకటేశ్వరరావు తెలిపారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ హనీష్



కంచికచర్ల పీఎస్‌లో కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ నాగేంద్రకుమార్

నందిగామ: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని ఇన్‌స్పెక్టర్ హనీష్ హెచ్చరించారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. రౌడీషీటర్లు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. ప్రతి రౌడీషీటర్‌పై ప్రత్యేక నిఘా ఉందన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ పండు దొర, సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీషీటర్లు అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

కంచికచర్ల: రౌడీషీటర్లు అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని నందిగామ రూరల్ సర్కిల్ సీఐ ఐవీ నాగేంద్రకుమార్ హెచ్చరించారు. కంచికచర్ల పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఇతర ప్రాంతాలకు రౌడీషీటర్లు వెళితే పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. గ్రామాల్లో ప్రజలతో కలిసి మెలసి ఉండాలని చట్ట వ్యతిరేక పనులు చేయరాదన్నారు. ఇతరులతో మర్యాదపూర్వకంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం, ఏఎస్ఐ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మద్దతుదారుల విజయ పరంపర

నందిగామ: నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల పరిధిలో జరిగిన గ్రామ పంచాయతీ వార్డు, సర్పంచ్‌ల ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారుల విజయ పరంపర కొనసాగింది. నందిగామ నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల్లో 4 వార్డు సభ్యులకు, ఒక సర్పంచ్‌కు ఉప ఎన్నికల జరిగాయి. వాటిలో మూడు వార్డు సభ్యుల ఎన్నిక ఏకగ్రీవం కాగా ఒక వార్డుకు సర్పంచ్ అభ్యర్థికి ఎన్నికల జరిగాయి. వీటన్నింటిలోనూ వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులే విజయం సాధించారు.

ఏకగ్రీవమైన వార్డుల వివరాలు

నందిగామ నియోజకవర్గ పరిధిలోని చందర్లపాడు మండలం పొక్కునూరు 5వ వార్డు వైఎస్సార్ సీపీ బలపర్చిన అభ్యర్థి జె.నాగలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కంచికచర్ల మండలం కొత్తపేట 7వ వార్డు వైఎస్సార్ సీపీ బలపర్చిన అభ్యర్థి ఎం.గోపిక ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా వీరులపాడు మండలం దొడ్డదేవరపాడు 6వ వార్డు వైఎస్సార్ సీపీ బలపర్చిన అభ్యర్థి అద్దంకి బేబీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని నందిగామ మండలంలో గల తొర్రగుడిపాడు 8వ వార్డు టీడీపీ బలపర్చిన అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఎన్నికలు జరిగిన స్థానాలు

వీరులపాడు మండలం దాచవరం గ్రామ సర్పంచ్‌గా వైఎస్సార్ సీపీ బలపర్చిన గద్దె వెంకటేశ్వర్లు విజయం సాధించారు. అదేవిధంగా వీరులపాడు మండలం జమ్మవరం 8వ వార్డుకు ఎన్నికలు జరగ్గా వైఎస్సార్ సీపీ బలపర్చిన అభ్యర్థి ఈ కటాక్షం విజయం సాధించారు.



దాచవరంలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఓటర్లు (ఫైల్)

సాంప్రదాయానికి విలువ ఇవ్వని టీడీపీ

రాష్ట్రంలో ఎక్కడ ఉప ఎన్నికలు జరిగినా కూడా అక్కడ ఏ పార్టీ అయినా సాంప్రదాయానికి విలువ ఇస్తుంది. నందిగామ నియోజకవర్గంలో సాంప్రదాయానికి టీడీపీ విలువ ఇవ్వలేదు. వాస్తవానికి వీరులపాడు మండలం దాచవరం సర్పంచ్ గా అప్పట్లో గెలుపొందిన గద్దె కోటేశ్వరరావు కరోనా సమయంలో కనీసం ప్రమాణ స్వీకారం కూడా చేయకుండానే మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గద్దె కోటేశ్వరరావు తండ్రి అయిన వెంకటేశ్వర్లను సర్పంచ్ అభ్యర్థిగా బలపర్చింది. అయినప్పటికీ టీడీపీ కూడా అభ్యర్థిని నిలబెట్టింది. ఎలాగైనా టీడీపీ బలపరిచిన అభ్యర్థిని గెలిపించుకునేందుకు ఆ పార్టీ ఎన్నో ఎత్తుగడలు వేసినప్పటికీ గ్రామస్తులు మాత్రం సాంప్రదాయానికే పెద్దపీట వేశారు. వైఎస్సార్ సీపీ బలపర్చిన అభ్యర్థినే గెలిపించారు. గతంలో నందిగామ ఎమ్మెల్యేగా గెలిచిన తంగిరాల ప్రభాకరరావు మృతి చెందిన సమయంలో వైఎస్సార్ సీపీ ఎన్నికల్లో పోటీ చేయలేదు. ఈ నేపథ్యంలో అప్పట్లో తంగిరాల సౌమ్య ఎమ్మెల్యేగా గెలుపొందారు.



గద్దె వెంకటేశ్వర్లు, దాచవరం సర్పంచ్



కటాక్షం, జమ్మవరం వార్డు మెంబర్



అద్దంకి బేబీ, దొడ్డ దేవరపాడు వార్డు మెంబర్ (ఏకగ్రీవం)



గోపిక, కొత్తపేట వార్డు మెంబర్ (ఏకగ్రీవం)

అభివృద్ధిని చూసి ఓర్వలేకే టీడీపీ విమర్శలు

ఎమ్మెల్సీ అరుణకుమార్



డాక్టర్ అరుణకుమార్, ఎమ్మెల్సీ

కంచికచర్ల: వీరులపాడు మండలం దాచవరంలో జరిగిన సర్పంచ్ ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుతో గెలిచినందుకు టీడీపీ మద్దతు ఇచ్చిన అభ్యర్థి ఓటమి పాలవటంతో టీడీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య జీర్ణించుకోలేకపోతున్నారని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. కంచికచర్ల వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబు అధ్యక్షతన ఆదివారం రాత్రి సమావేశం జరిగింది. ఈ మేరకు ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. దాచవరంలో జరిగే సర్పంచ్ ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతు దారుడిని దమ్ముంటే గెలిపించుకోవాలని గతంలో ఆమె చాలెంజ్ చేశారని ఆ చాలెంజ్‌ను సున్నితంగా తిరస్కరించామన్నారు. ఎన్నికల్లో టీడీపీ ఓటమి పాలయ్యే సరికి నైతికత గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నించారు. ప్రజా తీర్పును అవమానించేలా మాజీ ఎమ్మెల్యే వ్యవహరిస్తున్నారని, డబ్బులు పంచితేనే వైఎస్సార్ సీపీ మద్దతుదారుడు గెలిచారని ఆమె అంటున్నారన్నారు. అయితే గతంలో మాజీ ఎమ్మెల్యే సార్వత్రిక ఎన్నికల్లో గెలిచారని, ఆమె కూడా ప్రజలకు డబ్బులు పంచి గెలిచారా అని ప్రశ్నించారు. ఉప ఎన్నిక నోటిఫికేషన్ వచ్చిన దగ్గర నుంచి ఫలితం వెలువడిన తర్వాత కూడా ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు గ్రామంలో అడుగు పెట్టలేదని గుర్తుచేశారు. మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రెస్‌మీట్ పెట్టి ఏం మాటలు మాట్లాడుతున్నారో ఆమెకే అర్థంకాకపోవటం బాధాకరమన్నారు. నియోజకవర్గంలో జరిగిన మొత్తం పంచాయతీ ఎన్నికల్లో ఎమ్మెల్యే కాని తాను కాని ప్రచారాల్లో పాల్గొనలేదని గుర్తుచేశారు. మాజీ ఎమ్మెల్యే ప్రచారం చేసినా దాచవరంలో ప్రజలు టీడీపీని తిరస్కరించారన్నారు.

2014లో మాయమాటలు చెప్పిన చంద్రబాబు...

గతంలో అనుభవం ఉన్న చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ప్రజలంతా 2014 ఎన్నికల్లో నమ్మి ఓట్లేసి గెలిపించారన్నారు. కాని ఐదేళ్ల పాలనలో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా గ్రాఫిక్స్‌లతో...తాత్కాలిక భవనాలతో పాలన సాగించిన సంగతి రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిన విషయమేనని చెప్పారు. అందుకే 2019 ఎన్నికల్లో టీడీపీని ఓడించి వైఎస్సార్ సీపీకి చెందిన 151 మంది ఎమ్మెల్యేలను గెలిపించారని గుర్తుచేశారు. తమ పార్టీ సాంప్రదాయాలను గౌరవిస్తుందని, అందుకే మాజీ ఎమ్మెల్యే తంగిరాల ప్రభాకరరావు గుండెపోటుతో మృతిచెందితే తర్వాత జరిగిన ఉపఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పోటీ చేయలేదని అందుకే తంగిరాల సౌమ్య గెలిచిన విషయం నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసన్నారు. అయితే దాచవరంలో సర్పంచ్ మృతి చెందితే ఆ స్థానంలో మృతి చెందిన సర్పంచ్ కుటుంబ సభ్యులను ఉప ఎన్నికల్లో నిలబెడితే టీడీపీ పార్టీ తరుపున పోటీలో నిలబెట్టటం హేయమైన చర్య అన్నారు. కాని దాచవరం ప్రజలు తిరిగి మృతి చెందిన సర్పంచ్ కుటుంబ సభ్యులను ఎన్నికల్లో గెలిపించి సాంప్రదాయాలను తుంగలో తొక్కిన మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య చెంపను చెళ్లుమనిపించారన్నారు.

అభివృద్ధికి అడ్డుపడుతున్న తంగిరాల...

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నందిగామ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేస్తున్నామని అయితే మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అభివృద్ధి జరగకుండా నిత్యం అడ్డుపడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. నందిగామ గాంధీ సెంటర్‌లో అస్తవ్యస్తంగా ఉన్న రాజకీయ నాయకులు, దేశనేతల విగ్రహాలను తొలగించి ట్యాంక్‌బండ్ మాదిరిగా విగ్రహాలను ఏర్పాటు చేస్తుంటే టీడీపీ నాయకులు నందిగామలో అభివృద్ధి జరటానికి వీల్లేదని కోర్టుకు వెళ్లి స్టేలు తెచ్చిన ఘనత మీది కాదా అని నిలదీశారు. నందిగామలో సుందరీకరణ చేయాల్సిన అవసరం ఏమిటి, నందిగామ ఏమైనా మహానగరమా అని మాజీ ఎమ్మెల్యే సౌమ్య అనటం నియోజకవర్గ ప్రజలందరూ ఆమెను అసహ్యించుకుంటున్నారని ఎమ్మెల్సీ అన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకే తాము రాజకీయాల్లోకి వచ్చామని ఎమ్మెల్సీ స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ నన్నపనేని నరసింహారావు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదుగుల శంకర్, జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, సర్పంచ్ వేల్పుల సునీత, నాయకులు కాలవ పెదబాబు, వేల్పుల శ్రీనివాసరావు, దేవరకొండ గురవయ్య, నారిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వెయ్యి ఎకరాలకు సాగునీరు సరఫరా

ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేటఅర్బన్: జిల్లాలో మేటి పర్యాటక కేంద్రంగా జగ్గయ్యపేట ఊర చెరువును అభివృద్ధి చేస్తుండగా, ప్రతిపక్షాలు అభినందించాల్సింది పోయి ఓర్వ లేక అడుగడుగున విమర్శలు చేస్తున్నాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. చెరువు అభివృద్ధి పనుల వలన చెరువు ఆయకట్టు కింద ఉన్న 300 ఎకరాల పంట పొలాలకు ఆటంకం కలుగుతుందని ప్రతిపక్షాలు విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆదివారం చెరువు ఆయకట్టు కింద సాగవుతున్న పంట పొలాలను ఉదయభాను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ చెరువు అభివృద్ధి వలన పంట పొలాలకు ఎటువంటి నష్టం జరగదన్నారు. పైగా గతంలో కంటే చెరువులో లోతు తీయడం వలన నీరు ఎక్కువ నిలువ చేయడం జరుగుతుందని, తద్వారా చెరువు ఆయకట్టు క్రింద సాగు అయ్యే పంట పొలాలకు పుష్కలంగా నీరు లభిస్తుందన్నారు. ఇప్పుడున్న 300 ఎకరాల కంటే అదనంగా 1000 ఎకరాలకు సరిపడా నీటి సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని, జగ్గయ్యపేట పట్టణ అభివృద్ధికి ఆటంకాలు కల్పించకుండా పార్టీల కతీతంగా అందరూ సహకరించాలని, అప్పుడే మన పట్టణం అభివృద్ధి చెందుతుందన్నారు.

వాకింగ్ ట్రాక్ నిర్మించాలి..

పట్టణంలోని ఊర చెరువు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే ఉదయభాను అన్నారు. ఆదివారం చెరువు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. విశాలమైన వాకింగ్ ట్రాక్ నిర్మించాలన్నారు. పట్టణంలోని ఊర చెరువుకు ప్రధాన వాటర్ సప్లయ్ చానెల్స్ అయిన ఎర్రకాలువ, వేపలవాగుల్లో పూడిక తీత పనులను ఉదయభాను పరిశీలించారు. వేపలవాగు, ఎర్రకాలువల్లో గుర్రపుడెక్క, తూటికాడ, కంపచెట్లు పెరిగి పోవడంతో నీటి సరఫరాకు ఆటంకం కలగటంతో సమస్యను గుర్తించామన్నారు. రూ.40 లక్షల వ్యయంతో యుద్ధ ప్రాతిపదికన పూడికతీత పనులు చేపట్టినట్లు తెలిపారు. పూడికతీత పనులను పూర్తయితే చెరువుకు పుష్కలంగా నీరు లభిస్తుందన్నారు.



చెరువు ఆయకట్టు కింద పొలాలను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

డ్రెయిన్ల నిర్మాణానికి చర్యలు..

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణ అభివృద్ధిలో భాగంగా అన్ని వార్డుల్లో డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణాలు విస్తృతంగా చేపడుతున్నట్లు ప్రభుత్వ విప్ ఉదయభాను తెలిపారు. ఆదివారం 7వ సచివాలయం పరిధిలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఆయనకు స్థానికులు చేసిన విజ్ఞప్తి మేరకు రూ.2 లక్షల వ్యయంతో డ్రెయినేజీ నిర్మాణం, వీధి బోరు పంపు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

నేడు సచివాలయాల కన్వీనర్లతో సమావేశం..

సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక బి కన్వెన్షన్‌లో జగ్గయ్యపేట నియోజకవర్గ స్థాయి సచివాలయాల కన్వీనర్లతో సమీక్ష సమావేశం జరుగుతుందని ఎమ్మెల్యే కార్యాలయం ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. సచివాలయాల కన్వీనర్లకు జీవిత భీమాకు సంబంధించి తీసుకురావాల్సిన డాక్యుమెంట్లు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఒరిజినల్ ఆధార్ కార్డు, జిరాక్సు, నామినీ ఆధార్ జిరాక్స్ తీసుకురావాలని తెలిపారు. సచివాలయాల కన్వీనర్లు, ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

సమతుల ఆహారం తీసుకోవాలి

తిరువూరు: మధుమేహం, రక్తపోటు తదితర వ్యాధుల బారిన పడకుండా సమతుల ఆహారం తీసుకోవాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా కన్వీనర్ డాక్టర్ వల్లభనేని రవీంద్ర సూచించారు. స్థానిక నాగార్జున స్కూలు ఆవరణలో ఆదివారం జేవీవీ ఆధ్వర్యంలో మధుమేహ వ్యాధిగ్రస్తుల ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. రోజూ క్రమం తప్పని వ్యాయామం, మితాహారం తీసుకోవడం ఆరోగ్యకర జీవనానికి తోడ్పడతాయని తెలిపారు. కృష్ణా, ఎన్టీఆర్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ఏలూరు జిల్లాల నుంచి సుమారు రెండు వేల మంది రోగులకు ఈ వైద్యశిబిరంలో మధుమేహ, రక్తపోటు వ్యాధులకు వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు ఇచ్చారు. వైద్యులు రాజేశ్వరి, లక్ష్మణరావు, తేజ వైద్యసేవలందించారు. జేవీవీ ప్రతినిధులు రాంప్రదీప్, హరికృష్ణ, పాపారావు, సుదర్శన్ పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

తిరువూరు: ప్రముఖ హేతువాది నరేంద్ర దభోల్కర్ వర్ధంతి కార్యక్రమం స్థానిక నాగార్జున స్కూలులో ఆదివారం నిర్వహించారు. ప్రజల్లో మూఢనమ్మకాలు పారదోలడానికి, శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు నరేంద్ర చేసిన కృషిని జన విజ్ఞాన వేదిక చెకుముకి విభాగ రాష్ట్ర కన్వీనర్ ఎం.హరికృష్ణ విద్యార్థులకు వివరించారు. జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.